# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఇండియా కూటమి ఆధ్వర్యంలో విజయవాడలో ఈరోజు నిర్వహించే బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారు.**

**2. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా తెలిపారు.**

**3. ఎన్నికలు జరిగే మే 13వ తేదీన ఉద్యోగులు, కార్మికులకు సెలవు మంజూరు చేసినట్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ యం.బాలునాయక్ పేర్కొన్నారు.**

**4. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్  ఈ రోజు అయోధ్యలో పర్యటిస్తారు.**

**5. ఉత్తరాఖండ్ లోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన కేదార్ నాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాల్లో ఈ రోజు నుంచి దర్శనాలు ప్రారంభమైయ్యాయి.**

============================

ఇండియా కూటమి ఆధ్వర్యంలో విజయవాడలో ఈరోజు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ వెల్లడించారు. నిన్న విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయవాడ జింఖానా మైదానంలో ఈ రోజు సాయంత్రం జరిగే  బహిరంగ సభలో  ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారని వెల్లడించారు. అలాగే రేపు కడపలో జరిగే బహిరంగ సభకు రాహుల్‌గాంధీ రానున్నారని తెలిపారు.

-------------------------

ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకునేలా చూడాలని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా అధికారులకు సూచించారు. నిన్న కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బాలాజీ, ఐజీ అశోక్‌కుమార్, కేంద్ర పరిశీలకులు ప్రసాద్‌ప్రలాద్, జాన్‌కింగ్స్‌లే, నరహరిసింగ్‌బంగర్, ప్రవీణ్‌మోహన్‌దాస్, వికాస్‌చంద్రకరోల్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దీపక్‌మిశ్రా  మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించుకునేలా పోలీస్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు  సంబందించి తీసుకున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను అందించేలా సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఈరోజు గుంటూరు పార్లమెంట్ పరిధిలోని మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ప్రచార సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌర సేవలను అందించామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం ప్రజలు వైసీపీకి తోడ్పాటును అందించాలని అన్నారు. కాగా సభ అనంతరం ముఖ్యమంత్రి చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని నగరి నియోజకవర్గంలో పుత్తూరులో జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం కడప పార్లమెంట్ పరిధిలో కడప నగరంలోని మద్రాస్ రోడ్ శ్రీ పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో జరిగే ప్రచార సభలో పాల్గొంటారు.

---------------------------

వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వేతనాలతో కూడిన సెలవు మంజూరు చేసినట్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ యం.బాలునాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు జరిగే 13వ తేదీన ఉదోగులు, కార్మికులు, అర్హులైన ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి కార్మికులకు సెలవు ఇవ్వకుంటే జరిమానాతోపాటు శిక్షార్హులని పేర్కొన్నారు.

---------------------------

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఈ రోజు అయోధ్యలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి దంపతులు అయోధ్యలోని శ్రీ రామ్ లల్లా ఆలయాన్ని సందర్శించి బాలరామునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం హనుమాన్‌గర్హి ఆలయం, కుబేర్ తిలాలను సందర్శిస్తారు. అలాగే అయోధ్యలో సరయూ ఘాట్‌లో జరిగే హారతిలో వారు పాల్గొంటారని ఉపరాష్ట్రపతి కార్యాలయం తెలిపింది. కాగా ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా అయోధ్య రామాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

---------------------------

కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ జైశంకర్, మాల్దీవుల విదేశాంగ మంత్రి మూస జమీర్‌లు నిన్న ఢిల్లీలో సమావేశమైయ్యారు. ఈ సమావేశంలో భారత్ మాల్దీవుల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించారు. సామర్థ్య నిర్మాణం, శిక్షణ, విపత్తు సహాయం వంటి అంశాలపై ఇరువురు నేతలు సమీక్ష జరిపారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ ధీర్ జైస్వాల్ తెలిపారు. మాల్దీవుల్లో మిగిలి వున్న చివరి విడత సిబ్బంది తరలింపు విషయంలో ఉభయ దేశాలు చర్చించాయని తెలిపారు.

---------------------------

ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు రేపు సాయంత్రం 6 గంటల నుంచి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. నిన్న కలెక్టర్ ఏలూరులో మాట్లాడుతూ, 144 సెక్షన్ అమలులో ఉన్న సమయంలో సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. జనం గుంపులు గుంపులుగా, అయిదుగురు కంటే ఎక్కువ మంది సమూహంగా ఉండకూడదని తెలిపారు. పదునైన ఆయుధాలు, కర్రలు,

రాళ్లు వంటివి వెంట తీసుకెళ్లడాన్ని నిషేధించినట్లు వివరించారు.

---------------------------

ఉత్తరాఖండ్ లోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన కేదార్ నాథ్, గంగోత్రి, యమునోత్రి ఆలయాలు ఈ రోజు తెరుచుకున్నాయి. శీతాకాలంలో మూసేసిన ఈ ఆలయాలను ఈ రోజు తెరిచినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు చార్ ధామ్ యాత్రలో భాగమైన బద్రీనాథ్ ఆలయాన్ని ఈ నెల 12న తెరవనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆనవాయితీ ప్రకారం 47 కి.మీ. దూరంలో ఉన్న ఉల్లిమర్‌లోని ఓంకారేశ్వర్ ఆలయం నుంచి కేదార్ బాబా పంచముఖ విగ్రహాన్ని కేదార్ నాథ్ కి  తీసుకొచ్చినట్లు  ఆలయ అధికారులు తెలిపారు.

---------------------------

ఎన్నికల అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరచడానికి అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేశామని చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి,  కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను, రిసెప్షన్  కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన  మాట్లాడుతూ, ఈవిఎం స్ట్రాంగ్ రూములకు  భద్రత ఏర్పాట్లు  పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈవిఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రంల వద్ద  భద్రతా ఏర్పాట్లు చేశామని వివరించారు.

---------------------------

18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో  విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని  శ్రీకాకుళం జిల్లా ఎన్నికల అధికారి,  జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు  శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,  ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని అన్నారు. మారుమూల గ్రామాల్లో, సమస్యాత్మక  పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ శాతం పెరగేలా  అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో విద్యార్థులు దేశీయ విశ్వవిద్యాలయాలతోపాటు విదేశాలలోని విశ్వవిద్యాలయాలలోనూ విద్యను అభ్యసించేందుకు అబ్రాడ్ స్టడీ ప్రోగ్రామ్ పేరుతో ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి పి. రాజశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం అమెరికాలోని టెక్సాస్‌లో గల వెస్లీయాన్ విశ్వవిద్యాలయం నిన్న అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా వెస్లీయాన్ విశ్వవిద్యాలయ ఇంటర్నేషనల్ అడ్మిషన్ కోఆర్డినేటర్ జులిస్మిత్ బృందం నిన్న నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, అక్కడి సదుపాయాలను పరిశీలించింది. అనంతరం ఉపకులపతి పి. రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ ఒప్పందంలో భాగంగా విదేశీ విశ్వవిద్యాలయాలలో ఇక్కడి విద్యార్థులు  కంప్యూటర్ సైన్స్ లో క్లౌడ్ కంప్యూటర్స్, కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి విభాగాలలో  చదువుకునే అవకాశం లభిస్తుందని  వివరించారు.

---------------------------

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తిరుపతి జిల్లా ఎస్పీ క్రిష్ణ కాంత్ పటేల్ తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు భద్రతా ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో చేపట్టామన్నారు. ఓటరు స్లిప్పులు పంపిణీ జరుగుతోందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ రేపటికి పూర్తి స్థాయిలో ఏర్పాటు అవుతుందని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

-----------------------------

లింగస్థ గర్భ నిర్ధారణను నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని విజయనగరం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. నిన్న విజయనగరంలోని జిల్లా స్థాయి సలహా సమితి సమావేశాన్ని నిర్వహించారు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సామాజిక రుగ్మతలు నిర్మూలించడానికి, స్త్రీ పురుష నిష్పత్తి సమానంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నిష్పత్తిలో తేడాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా ఆరోగ్య శాఖ అధికారులు స్కానింగ్ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

======================